అధ్వానంగా అంబాపురం - రాజీవ్‌నగర్ రోడ్డు

- రోడ్డు నిర్మాణానికి ఏళ్ల తరబడి ప్రజల ఎదురుచూపులు
- గత టీడీపీ పాలనలోనే సీఆర్డీఏ నిధుల మంజూరు
- కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనా చర్యలు నిల్

విజయవాడరూరల్: విజయవాడ నగరానికి కూత వేటు దూరంలో ఉన్న గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రహదారులు అభివృద్ధి చేస్తామని హామీలిచ్చిన పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజయవాడ నగరానికి ఆనుకొని ఉన్న అంబాపురం గ్రామం నుంచి రాజీవ్‌నగర్ వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వ పాలనలో పాలకుల నిర్లక్ష్యానికి నిలువటద్దంగా దర్శనమిస్తోంది. ఈ రోడ్డుకు గత టీడీపీ పాలనలో జన్మభూమి రోడ్డుగా నామకరణం చేసి రోడ్డు నిర్మాణం పనులను మధ్యలోనే నిలిపివేశారు. బీటీ రోడ్డు నిర్మాణానికి సీఆర్డీఏ దాదాపు మూడున్నర కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసింది. రోడ్డు కాంట్రాక్ట్ తీసుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ పర్చడం, కంకర తోలించి సెక్షనింగ్ పనులు చేశారు. ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, పాలకులు పట్టించుకోకపోవడంతో ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో రోడ్డు పనులు మధ్యంతరంగా ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చినుకు పడితే చిత్తడే..

వర్షం వస్తే అంబాపురం, పి.నైనవరం, అప్పారావుపేట గ్రామాల నుంచి పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి విజయవాడ, ఆటోనగర్, పరిసర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు, ప్రైవేటు కంపెనీల్లో పనులకు వెళ్లే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అంబాపురం, పి.నైవనరం గ్రామాల రైతులు వ్యవసాయ పనులు నిర్వహించుకోవడం, వ్యవసాయోత్పత్తులను ఇళ్లకు తీసుకురావడానికి ఎంతో అనువుగా ఉంటున్న ఈ రోడ్డు నిర్మించాలని గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అంతేకాక విజయవాడ నగర విస్తరణకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అంబాపురం గ్రామానికి ఆనుకొని ఉన్న వెస్ట్ హైవే రోడ్డు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులకు, తూర్పు వైపు ఏలూరు, రాజమండ్రి వెళ్లే ప్రయాణికులకు ఎంతో అనువుగా ఉంటుంది. రోడ్డు మధ్యలో ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రోడ్డు నిర్మించాలని ఇటీవల గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ దృష్టికి రైతులు, గ్రామస్తులు తీసుకెళ్లారు. ఆయన సీఆర్డీఏ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం జరిగేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. గ్రామాలతో పాటు విజయవాడ నగర వాసులకు ఉపయోగపడే ఈ రోడ్డును నిర్మించాలని గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి.


గోతులమయంగా జన్మభూమి రోడ్డు


వర్షానికి బురదమయంగా రహదారి

వర్షం పడితే నరకం..


జన్మభూమి రోడ్డు గోతులమయం, నడవటానికి వీల్లేని పరిస్థితి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం వస్తే ఆ రోడ్డుపై వెళ్లాలంటే నరకం కనబడుతుంది. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును నిర్మించాలి.

– కుందేటి చిన్నమిషేక్, అంబాపురం గ్రామం

రోడ్డు నిర్మించాలి..


అంబాపురం – రాజీవ్ నగర్ రోడ్డు అధ్వానంగా ఉంది. పేరుకే రోడ్డు, అంతా గోతులమయంగా ఉంది. పిల్లలు, పెద్దలు రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సిందే. రోడ్డును నిర్మిస్తే గ్రామాల, నగర ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– తాడిబోయిన సాంబయ్య, రైతు, పి.నైనవరం

మహాత్మాగాంధీ విగ్రహం ధ్వంసం



పెనమలూరు: కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామంలో చింతలకట్ట వద్ద విజయవాడ–అవనిగడ్డ రహదారి పక్కన ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యనమలకుదురులో గత వైఎస్సార్ సీపీ పాలనలో చింతలకట్టపై మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, బాబాసాహెబ్ అంబేడ్కర్, అబ్దుల్ కలాం ఇలా పలువురు జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఈ విగ్రహాల వద్ద అనేక దేశభక్తి కార్యక్రమాలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాంతం ఆక్రమణలకు గురవ్వటమే కాకుండా చెత్తచెదారం వేయటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. మందుబాబులు ఈ విగ్రహాల వద్ద రాత్రి వేళల్లో మద్యం సేవిస్తున్నారని, పోలీసుల పెట్రోలింగ్ లేకపోవటంతో మందుబాబుల ఆగడాలు పెరిగాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు జాతిపిత విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహానికి ఉన్న తలను తొలగించారు. తాడిగడప మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు స్పందించి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోని, బాపూజీ నూతన విగ్రహం తిరిగి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పశువుల షెడ్డును ప్రారంభించిన పీఆర్ కమిషనర్



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు లక్షా 85 వేల రూపాయలతో నిర్మించిన పశువుల షెడ్డును పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణతేజ సోమవారం ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఆరు పశువుల షెడ్డు నిర్మాణానికి 2.30 లక్షల రూపాయలు, నాలుగ పశువుల షెడ్డు నిర్మాణానికి 1.85 లక్షల రూపాయల చొప్పున ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారు బి.సుధారాణి, డ్వామా పీడీ ఎ.రాము, డీపీఓ లావణ్య, ఎంపీడీఓ బి.విగ్గిన్స్, డెప్యూటీ ఎంపీడీఓ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల భద్రతకు చర్యలు



పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లోని వక్ఫ్ భూములు పరిరక్షించటానికి చర్యలు చేపట్టారు. రెవెన్యూ, వక్ఫ్, సచివాలయం అధికారులు సోమవారం వక్ఫ్ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో టీడీపీ నేతలు వక్ఫ్ భూములు ఆక్రమించి నయా పైసా కౌలు చెల్లించకుండా సాగు చేయటంతో ముందస్తు చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డులు పెట్టారు. కొండపల్లి ఖాజీ సయ్యద్ హబీబుల్లా హుసేనీ, వక్ఫ్ అధికారి కరీముల్లా పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత భవిత



పొట్టిపాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొట్టిపాడు జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్‌ను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్ కత్తుల జ్యోతి కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులపై దృష్టి సారించాలి



బుద్ధవరం(గన్నవరం): భూసారాన్ని పెంచుకునేందుకు రైతులు పచ్చిరొట్ట పైరులను సాగు చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.సునీల్ సూచించారు. మండలంలోని బుద్ధవరం పరిధిలో పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ సాగు చేస్తున్న పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పొలంలో భూసారం ఎంత పెరిగితే అందులో పండించే పంటలు అంతగా దిగుబడి అందిస్తాయన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం వల్ల రైతులకు నష్టం తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల కొన్నేళ్లకు భూమిలో సారం తగ్గిపోయి పంటలు కలుషితమవుతాయని తెలిపారు. వీలైనంత వరకు రసాయనిక ఎరువులను తగ్గించి పచ్చిరొట్ట ఎరువులపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. వీఏఏ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన బొంతల కోటేశ్వరరావు(46) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఫోన్‌లో పరామర్శించారు. మాజీ సర్పంచ్ మాదు అరుణ్‌కుమార్, కిశోర్‌కుమార్‌లు తమ వంతుగా రూ 5 వేలు ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎంపీటీసీ బూరగ బాలాజీ, వార్డు మెంబరు రాణి, నాయకులు నకరికంటి శేఖర్, నాగదేశి బాలకృష్ణ, నాగదేశి రవి, కె.జోజ్‌మేరీ, బోరగుడి శ్రీకాంత్, ఎం.ముత్యాలు పాల్గొన్నారు.

నిబంధనల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దు

కంకిపాడు: నిబంధనల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని, సమర్థంగా సేవలు అందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల ద్వారా ప్రజలకు అందే సేవలపై సోమవారం తహసీల్దార్ వి.భావనారాయణ, సబ్‌రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నత్తా వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. కళాశాలలు, పాఠశాలలు తెరిచారని, ధ్రువీకరణ పత్రాలు అవసరమైన విద్యార్థులకు జాప్యం లేకుండా వెంటనే సంబంధిత పత్రాలు అందజేయాలని కోరారు. ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ విషయంలో దస్తావేజులు ఉన్నప్పటికీ రెవెన్యూ శాఖ నుంచి పొజిషన్ సర్టిఫికెట్ కావాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దస్తావేజులు ఉన్న నివాసితులకు ధ్రువీకరణ పత్రంతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉంటూ సేవలు సమర్థంగా అందించాలని కోరారు. పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా, మట్టి తవ్వకాలు, పంట బోదెల ఆక్రమణలు జరిగాయంటూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, అక్రమ వ్యాపారం, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు శాఖలపై నమ్మకం పెంచాలని విజ్ఞప్తి చేశారు.


తహసీల్దార్ భావనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నత్తా వెంకటేశ్వరరావు

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

కంకిపాడు: కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈనెల 17వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌వైవీఎస్ మనోహర్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా వారానికి రెండు రోజుల పాటు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రసందర్శన, చర్చాగోష్టి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి మంగళ, బుధ వారాల్లో ముందస్తుగా సిద్ధం చేసుకున్న షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో పర్యటించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక పరమైన సూచనలు, సలహాలు అందించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఖరీఫ్, రబీ పంట కాలంలో నెలకు 8 రోజులు పాటు, రోజుకు రెండు గ్రామాలు చొప్పున 390 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

పెనమలూరు: ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జేఎన్‌టీయుకే, వాధ్వానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంట్రప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్, వెంచర్ క్రియేషన్ జనరేటీవ్ ఏఐ విత్ ర్యాగ్ పై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అధ్యాపకులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించాలని సూచించారు. దీని వలన విద్యార్థులు పరిశ్రమలకు కావల్సిన సాంకేతిక సేవలు అందించగలుగుతారని చెప్పారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయటం వలన విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లలో సత్తా చాటగలుగుతారన్నారు. సమాజానికి ఉత్తమ ఇంజినీర్లను అందించాల్సిన బాధ్యత అధ్యాపకులదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాధ్వానీ ఫౌండేషన్ డైరెక్టర్ దయాకర్‌మూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ప్రొఫెసర్లు అరుణ, సూర్యప్రసాదరావు, జానకి రామయ్య, సి.సుబ్బారావు, వివిధ కాలేజీల నుంచి 129 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

బాధ్యతలు స్వీకరించిన ఏవోలు


శివప్రసాద్, గన్నవరం ఏవో

గన్నవరం: మండల వ్యవసాయ శాఖాధికారిగా కె.శివప్రసాద్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న వై.రజని ఇబ్రహీంపట్నం మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మొవ్వ మండల వ్యవసాయ శాఖాధికారిగా పనిచేస్తున్న కె.శివప్రసాద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన శివప్రసాద్‌ను కార్యాలయ సిబ్బంది, రైతుమిత్ర కేంద్రాల వీఏఏలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉంగుటూరు ఏవోగా రమేష్..

ఉంగుటూరు మండల వ్యవసాయ శాఖాధికారిగా జి.రమేష్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న వీవీఎస్ఆర్ఎస్.హరీష్‌కుమార్ గంపలగూడెం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు జిల్లా దెందులూరు మండలంలో పనిచేస్తున్న జి.రమేష్ బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఉంగుటూరు, తేలప్రోలు రైతుమిత్ర కేంద్రాలను సందర్శించారు. సిబ్బంది చేపడుతున్న అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్న, సలహాలు, సూచనల కోసం నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి మండలంలో ఇప్పటి వరకు 95 శాతం ఈకేవైసీ పూర్తయ్యిందన్నారు.


రైతుమిత్ర కేంద్రాన్ని సందర్శించిన ఏవో రమేష్

సీపీఎం నేత త్రిమూర్తి హఠాన్మరణం



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ పరిధిలో పేదల హక్కుల కోసం పోరాటాలు చేసిన సీపీఎం నాయకుడు సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి(55) గుండె నొప్పితో సోమవారం వేకువ జామున పోరంకిలోని ఆస్పత్రిలో మృతి చెందారు. కృష్ణా జిల్లా వీరవల్లికి చెందిన త్రిమూర్తి గత 40 సంవత్సరాల కింద తాడిగడపకు వచ్చి స్థిరపడ్డారు. ఆయన గత 25 ఏళ్లుగా సీపీఎంలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ ప్రజల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారు. ప్రస్తుతం సీఐటీయూ మండల కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు. త్రిమూర్తి భౌతిక కాయానికి సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, చిగురుపాటి బాబూరావు, జిల్లా కౌలు రైతు సంఘ నాయకుడు మాగంటి హరిబాబు, జిల్లా సీపీఎం కార్యదర్శి వై.నరసింహారావు, పెనమలూరు, కంకిపాడు సీపీఎం, సీపీఐ, భవన నిర్మాణ సంఘం, మున్సిపల్ కార్మికుల సంఘం, ఐద్వా, వివిధ పార్టీలు, సంఘాల నేతలు శ్రద్ధాంజలి ఘటించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు లక్ష్యం చేరుకోవాలి

పెనమలూరు: ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని లక్ష్యం కోసం శ్రమించి చదవాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. కాలేజీలో సోమవారం కొత్తగా బీటెక్‌లో చేరిన విద్యార్థులకు ఆయన దశాదిశ నిర్దేశించారు. నేడు సాంకేతిక విద్య ప్రపంచ వ్యాప్తంగా మార్పులు చెందుతుందన్నారు. మారుతున్న సాంకేతిక విద్యకు అనుగుణంగా విద్యార్థులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. చదువుతో పాటు స్కిల్స్, పరిశోధనలు చేయాలన్నారు. ప్రో.వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో విద్యార్థులు ఎంత కష్టపడితే దానికి తగ్గట్లుగా ఫలితాలు సాధించ గలుగుతారన్నారు. ప్రపంచానికి అవసరమైన టెక్నాలజీపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, డీన్‌లు డి.వెంకట్రావు, జీఎస్ఎన్.స్వామి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరావు

రైతులతో కిక్కిరిసిన రైతుసేవా కేంద్రాలు

పెనమలూరు: మండల పరిధిలో రైతుసేవా కేంద్రాల వద్ద అన్నదాతలు పెద్ద సంఖ్యలో తరలిరావటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని ప్రకటన రావడంతో రైతులు రైతు సేవా కేంద్రాలకు తరలివచ్చారు. ఈ నెల 20వ తేదీన పీఎం కిసాన్‌తో పాటు, అన్నదాత సుఖీభవ సొమ్ము కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలలో ఉన్న రైతులు ఈకేవైసీ రైతు సేవా కేంద్రాల్లో చేయాల్సి ఉందని చెప్పటంతో రైతులు ఈకేవైసీ చేయటానికి ఆర్‌ఎస్‌కేలకు వచ్చారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది రైతుల వేలిముద్రలు తీసుకున్నారు.

జాబితా గందరగోళం..

ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా గందరగోళంగా మారింది. మండల పరిధిలో దాదాపు 5,400 మంది రైతులు సాగు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో కేవలం 1,627 మంది రైతులే అన్నదాత సుఖీభవకు అర్హులుగా చూపారు. రైతుల అర్హతకు ప్రభుత్వం అనేక ప్రమాణాలు విధించటంతో చాలా మంది రైతులకు అన్నదాత సుఖీభవ అర్హత సాధించలేక పోయారు. ప్రభుత్వం ప్రకటించిన జాబితా పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన రైతుభరోసా ఈ ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ ఎందుకు రాదని ప్రశ్నిస్తున్నారు. కాగా అన్నదాత సుఖీభవ రైతులకు ఏ మేరకు సొమ్ము జమ చేస్తారనేది స్పష్టత లేదని రైతులు చెబుతున్నారు.


పోరంకి ఆర్‌ఎస్‌కే వద్ద బారులు తీరిన రైతులు

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్న భర్తపై వివాహిత ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన పెళ్ళూరి స్వప్నదుర్గను రెండేళ్ల కిందట ఆటో నడుపుకొని జీవనం సాగించే శివకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. కొంతకాలంగా శివ తన భార్య దుర్గను అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

యోగాతో ఉత్తమ జీవన విధానం

గన్నవరంరూరల్: యోగా సాధన వల్ల ఉన్నత వ్యక్తిత్వం, ఉత్తమ జీవన విధానం అలవాటు అవుతాయని బిహార్ యోగా శిక్షణ నిపుణుడు తోటకూర శ్రీధారణ చెప్పారు. చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు యోగాంధ్రా –2025 యోగా శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ ఆధ్వర్యంలో గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సజన మార్గ నిర్దేశనంలో డాక్టర్లు, మెడికల్ విద్యార్థులు, హెచ్‌వోడీలు శిక్షణలో పాల్గొన్నారు. శ్రీధారణ మాట్లాడుతూ యోగా అంటే ప్రపంచంతో ఐక్యం కావటం, ప్రపంచాన్ని మనలోనే దర్శించటం అని చెప్పారు. యోగా సాధన మాటలకు అందని అనుభూతి అని, దీనిని సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. యోగా సాధకుల జీవితాలు ప్రపంచానికి ఆదర్శ గ్రంథాలుగా ఉండటం ఈ తరానికి పరిచయం చేయటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

300 మందికి శిక్షణ..

జూన్ 21వ తేదీ యోగా డే పురస్కరించుకుని కార్యక్రమాలు జరగటం అభినందనీయమని సిద్ధార్థ అకాడమీ యాజమాన్యానికి శ్రీధారణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థి, వ్యక్తి యోగ సాధకుడై పరిపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు రోగాలకు దూరంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచానికి యోగాను అందించిన ఘనత భారతదేశానిదని, ఇప్పుడు భరత జాతి చైతన్యంతో యోగా వైపు పయనించటం గొప్ప పరిణామమన్నారు.

భవిష్యత్ తరం సాధకులు యోగాలో నైపుణ్యం సాధించి ఇంటింటా ఆరోగ్య రక్షణ, సమాజ ప్రగతికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. 300 మంది యోగా శిక్షణలో పాల్గొన్నారు. డాక్టర్ సురేష్, మెడికల్ కాలేజ్ ఏవో టీవీ సుబ్బారావు, శిక్షకులు పాల్గొన్నారు.



యోగాలో శిక్షణ ఇస్తున్న తోటకూర శ్రీధారణ

వంతెన వద్ద చెత్త డంపింగ్

- గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు రైవస్ కాలువ సమీపంలోని వంతెన వద్ద ఇష్టారాజ్యంగా చెత్త డంప్ చేస్తున్నారు. చెత్త డంపింగ్ నిత్యకృత్యంగా మారడంతో ఈ ప్రాంతంలో చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. గ్రామంలోని చెత్తనంతటిని తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్న అధికారులకు మాత్రం పట్టడం లేదు. వంతెన దిగువ ప్రాంతంలో ఈ చెత్త డంప్ వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు.

మొన్నటి వరకూ చెరువు వద్ద డంపింగ్

గ్రామంలోని హిందూ శ్మశానం సమీపంలోని రామయ్య చెరువు వద్ద మొన్నటి వరకూ చెత్తను డంప్ చేసేవారు. ఫలితంగా చెత్త గుట్టలతో పాటు రైవస్ కాలువలో కలిసే ప్రధాన డ్రెయిన్ కూడా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయింది. ఈ చెత్త డంపింగ్‌తో ఏళ్ల నుంచి గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, డ్రెయిన్ అభివృద్ధి పరచాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రాంతంలో డంపింగ్‌ను నిలిపివేసి చెత్తను తొలగించారు. ఈ ప్రాంతంలో రైవస్ కాలువలో కలిసే డ్రెయిన్‌ను సుమారు రూ.20 లక్షల అంచనాతో మొదటి విడతగా అభివృద్ధి పరుస్తున్నారు. దీంతో చెరువు వద్ద చెత్త డంపింగ్ నిలిచిపోయిందనుకునేలోపు రైవస్ కాలువ వంతెన వద్ద డంపింగ్ ప్రారంభించడంతో పారిశుద్ధ్య సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంతెన వద్ద చెత్త డంపింగ్ నిలిపివేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ చెత్త డంపింగ్‌తో వంతెన ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోందని వాపోతున్నారు.

చెత్త కుప్పలు తొలగించాలి..

పైగా వంతెన వెంబడి చెత్త డంప్ చేస్తూ రైవస్ కాలువలో కూడా చెత్తను పడేస్తున్నారని చెబుతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రైవస్ కాలువ వద్ద గుట్టలుగా పేరుకుపోయిన చెత్త